www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -330 శనివారం 7 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# అభివృద్ధి విషయంలో రాజకీయాలొద్దు

**: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**మూసీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ**

**మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్న ముఖ్యమంత్రి**





**రంగారెడ్డిమార్చి6ప్రజావినికిడి** మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ ఎకో పార్కును శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫామ్‌హౌస్‌లో ఉన్నవారికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. **మిగతాది 2లో...**

## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

**ఇరాన్ బేషరతుగా లొంగిపోతేనే ఒప్పందం ఉంటుందన్న ట్రంప్**

**యుద్ధం ముగిశాక ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ**

**ట్రంప్ సరికొత్త నినాదం.. 'మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్'**

**హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను ముంచేసిన అమెరికా సబ్‌మెరైన్**

**యుద్ధం దెబ్బకు 90 డాలర్లకు చేరిన ముడిచమురు ధరలు**



**మార్చి6ప్రజావినికిడి**
ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. "ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ.. "మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్" అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు. **మిగతాది 2లో...**

## తెలంగాణ సొమ్ముతో కేరళలో ప్రచారం

**కాంగ్రెస్ మాయలో ప్రజలు పడొద్దు**

**: మాజీమంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్,మార్చి6ప్రజావినికిడి**
రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని కల్లబొల్లి మాటలు చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్క రాష్ట్రమైన కేరళలో మాత్రం రూ.వందల కోట్ల తెలంగాణ ప్రజాధనాన్ని మంచి నీళ్లలా పారబోస్తున్నారని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉప నేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ సొమ్ముతో కేరళలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ఆర్భాటాన్ని చేస్తున్నదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేరళ ఎన్నికల కోసం అక్కడి మలయాళ పత్రికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోలతో ఇస్తున్న ఫుల్ పేజీ యాడ్స్ చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఖజానా **మిగతాది 2లో...**

## అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం



**ఇద్దరు పైలట్లు దుర్మరణం**

**ఒకరు ఆపరేషన్ సిందూర్ పైలట్ పూర్వేశ్ దురాగ్కర్**

**న్యూఢిల్లీ,ప్రజావినికిడి**
అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ జెట్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు**మిగతాది 2లో...**

## అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి


**సిఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ**



**హైదరాబాద్,మార్చి6ప్రజావినికిడి**
అంబర్‌పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమైన జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వ్యాఖ్యానించారు.
**మిగతాది 2లో...**

## వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దతుగా నిలిచా

**మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ప్రజావినికిడి**
చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. **మిగతాది 2లో...**

## యూపీఎస్సీ సివిల్స్ 2025 తుది ఫలితాల విడుదల

**వివిధ కేంద్ర సర్వీసులకు 958 మంది ఎంపిక**

**ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచిన అనుజ్ అగ్నిహోత్రి**

**సత్తా చాటిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు**

**23వ ర్యాంకు సాధించిన జశ్వంత్ చంద్ర**



**న్యూఢిల్లీ,మార్చి6ప్రజావినికిడి**
దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025 తుది ఫలితాలు ఇవాళ విడుదలయ్యాయి. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా వివిధ కేంద్ర సర్వీసుల కోసం మొత్తం 958 మంది అభ్యర్థులను యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఈ ఫలితాల్లో అనుజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించి టాపర్‌గా నిలవగా, రాజేశ్వరి సువే రెండో ర్యాంకు, అకన్ష ధుల్ మూడో ర్యాంకును కైవసం చేసుకున్నారు. **మిగతాది 2లో...**



## నాచారం బ్రహ్మోత్సవాలకు కెసిఆర్‌కు ఆహ్వానం

హైదరాబాద్,**మార్చి6ప్రజావినికిడి** బీఆర్ఎస్ అధినేత , మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను నాచారం గుట్ట శ్రీ లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానం ప్రతినిధులు కలిశారు. ఈ నెల 8 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శుక్రవారం ఆహ్వాన పత్రికను , స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భగా ఆలయ అర్చకులు కేసీఆర్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్ , ఈవో రంగాచారి , అర్చకులు పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ



**ఉత్తర్వులు జారీ చేసిన ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్**

**ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం**

**గతంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పని చేసిన ఎర్రబెల్లి స్వర్ణ**

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి

**(మొదటి పేజీ తరువాయి)**

రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న రూ. 1.85 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టుల కేటాయింపులు కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ అభివృద్ధి మీద ఉన్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనమని పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు తెలంగాణలో 2,800 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మరో 2,500 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. తద్వారా తెలంగాణలో నూతనంగా ఏర్పాటైన జిల్లాలతో కలిపి మొత్తం 33 జిల్లాలు కూడా తక్కువ సమయంలోనే జాతీయ రహదారులతో అనుసంధానించామని.. ఇది చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ రూ.265 కోట్ల వ్యయంతో ఔఊ163 (గతంలో ఔఊ-202) మీద నగరంలోని అంబర్‌పేట క్రాస్ రోడ్డు వద్ద 1.5 కిలోమీటర్ల పొడవైన 4 వరుసల ౧÷÷-ల ఓవర్‌ను నిర్మించిందని గుర్తుచేశారు. 5 మే, 2025 నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ ఫ్లై ఓవర్‌ను ఘనంగా ప్రారంభించారని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తనతోపాటుగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఈ౧÷÷-ల ఓవర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తి కాలేదని అన్నారు. దీని నిర్మాణం జరిగి, ప్రారంభోత్సవం కూడా పూర్తి చేసుకున్నప్పటికీ దీని కింద ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణం మాత్రం పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. భూసేకరణ విషయంలో కొన్ని శక్తులు అడ్డుతగులుతోండటంతో అనవసరంగా తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇది 2018లో మంజూరయినప్పటికీ లేని సమస్యలు సృష్టించి భూసేకరణ పూర్తి కాకుండా కుట్రలు చేసి సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో జరగనివ్వకపోవడంతో ఈ రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం కె. చంద్రశేఖరరావు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి అనేకసార్లు తెలియజేశానని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ మంత్రులకు స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా అనేకసార్లు తెలియజేశారని అన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తాను కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి అనేకసార్లు మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పటికీ, ఈ సమస్య ఓ కొలిక్కి రాలేదని చెప్పుకొచ్చారు. భూసేకరణకు సంబంధించిన భూమికి రూ. 2.54 కోట్ల పరిహారం లబ్దిదారులకు ప్రభుత్వం చెల్లించినప్పటికీ మధ్య దళారులు అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ చూపించి, సర్వీసు రోడ్డు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత జీహెచ్‌ఎంసీ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకొని సర్వీస్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించటానికి సహకరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు.

# వర్గీకరణ కోసం చేసిన పోరాటానికి మద్దతుగా నిలిచా

**(మొదటి పేజీ తరువాయి)**



ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణనేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు.ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా?.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా?.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# అసోంలో కూలిన సుఖోయ్ యుద్ధవిమానం

**(మొదటి పేజీ తరువాయి)**

. పుర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పుర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పుర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పుర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు. అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు. పుర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను తాను త్యాగం చేసుకున్నాడు. పుర్వేష్ తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, తను కోరుకున్నంతగా దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు. తిరిగి విధుల్లోకి చేరిన తరువాత ఇలా జరిగింది.' అంటూ రవీంద్ర విలపించారు. ఫ్లైట్ లెఫ్టినెంట్ పుర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ శిక్షణా మిషన్‌లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్‌తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు తెలిపిన అధికారులు.. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కర్ ఈ తోయిబాలో భాగమైన రెసిస్టెన్స్ ఫ్రంట్ ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారతదేశం మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే భారత భద్రతా దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తరువాత పాకిస్థాన్.. భారత్‌పై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులకు తెగబడగా.. భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ప్రతిదాడులతో పాక్‌ను షేక్ చేశాయి. మే 10వ తేదీన ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించారు. దాంతో ఆపరేషన్ సిందూర్ నిలిచిపోయింది.

# 9నుంచి పార్లమెంట్ రెండోదశ సమావేశాలు

## ఈ సమావేశాల్లోనే స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసం

## ఎంపిలకు విప్ జారీ చేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు



**న్యూఢిల్లీమార్చి6ప్రజావినికిడి**

కేంద్ర బ్జడెట్‌పై రెండో దశ సమావేశాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి దశ సమావేశాలు అర్ధాంతరంగా వాయిదాపడ్డాయి. సభలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో సమావేశాల్ని వాయిదా వేశారు. రెండో దశ బ్జడెట్ సమావేశాల్లోనే ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడతారు. తర్వాత దీనిపై చర్చ, ఓటింగ్ ఉంటాయి. ఈ పక్రియ ప్రారంభమయ్యే వరకు స్పీకర్ చైర్‌లో ఓం బిర్లానే ఉంటారు. సోమవారం ప్రారంభం కానున్న చర్చ సమయంలో మాత్రం ఆయన సాధారణ ఎంపీలాగే సభలో కూర్చుంటారు. పార్లమెంట్ నిబంధనల ప్రకారం ఒక ఎంపీగా.. తన స్పీకర్ పదవిని రక్షిస్తూ మాట్లాడే అవకాశం కూడా ఉంటుంది. తాజా సమావేశాలు ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. వచ్చే వారం లోక్‌సభలో స్పీకర్‌పై కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షం అవిశ్వాస తీర్మానం పెట్టబోతుంది. ఈ నేపథ్యంలో ఈ తీర్మానంపై ఉత్కంఠ నెలకొంది. అందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ప్రతి ఒక్కరూ సభలో చర్చ, ఓటింగ్ సందర్భంగా అందుబాటులో ఉండాలని ఆదేశించాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పదవి నుంచి తొలగించాలని కోరుతూ గత నెలలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానానికి నోటీస్ ఇచ్చాయి. దీనిపై ఈనెల 9, 10 తేదీల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరగనుంది. అందువల్ల ఈ రెండు రోజుల్లో తమ ఎంపీలు అందరూ సభకు హాజరవ్వాలని, అందుబాటులో ఉండాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఈ మేరకు తమ ఎంపీలు సభలో ఉండి, ప్రభుత్వానికి మద్దతు తెలపాలని బీజేపీ సూచించింది. స్పీకర్ ఓంబిర్లా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని కోరుతూ గత నెలలో ప్రతిపక్షాలకు చెందిన 118 మంది ఎంపీలు సంతకాలు చేసి, నోటీసులు ఇచ్చారు. అయితే, నోటీసు ఇచ్చిన తర్వాత నుంచి సభ వాయిదా పడి కార్యకలాపాలు నిలిచిపోయాయి.

# తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ



**హైదరాబాద్,మార్చి6ప్రజావినికిడి**

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రబెల్లి స్వర్ణకు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆమె వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పని చేశారు. 2002లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన ఎర్రబెల్లి స్వర్ణ, నగరానికి మొట్టమొదటి మహిళా మేయర్‌గా సేవలు అందించారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా కూడా గతంలో బాధ్యతలు నిర్వర్తించారు. ఎర్రబెల్లి స్వర్ణను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమించడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యూపీఎస్సీ సివిల్స్ 2025 తుది ఫలితాల విడుదల

**(మొదటి పేజీ తరువాయి)**



ఈసారి ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన అభ్యర్థులు తమ సత్తా చాటారు. దాదాపు 30 మందికి పైగా తెలుగు అభ్యర్థులు సివిల్స్‌లో విజయకేతనం ఎగురవేయడం విశేషం. ముఖ్యంగా ఆల్ ఇండియా 23వ ర్యాంకుతో జీను శ్రీ జస్వంత్ చంద్ర, 55వ ర్యాంకుతో గుడెల్లి సృజన (పెద్దపల్లి జిల్లా) ఉభయ తెలుగు రాష్ట్రాల్లో టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. వీరిద్దరూ ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతుండటం గమనార్హం.

ఇక ఇతర తెలుగు అభ్యర్థుల్లో పోలవరపు ధ్వనీష్ (108), అట్ల తరుణ్ తేజ (123), శ్రీగిరిరాజు వి.పి.ఎస్. సాయి కృష్ణ (125), కొలిపాక శ్రీకృష్ణ సాయి (150), బానోత్ లక్ష్మి రచన (178), ఎస్. వర్షిత్ రెడ్డి (259), మాసమ్మగారి పవన్ కుమార్ రెడ్డి (297) మంచి ర్యాంకులు సాధించారు. అలాగే వెలిమినేటి విక్రమ్ సింహా రెడ్డి (541), గుమ్మల శ్వేత (573), వెలిమినేటి విజయసింహా రెడ్డి (682), పుడారి రాహుల్ (748), కత్తిమాని అనిరుధ్ (786), కొరపోతుల శ్రీకర్ రాజు (806), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823), కట్టా ప్రత్యూష (908), రాజశేఖర్ గోగుల (920), గుగోలత్ జితేందర్ నాయక్ (939) కూడా విజేతల జాబితాలో నిలిచారు. లక్షలాది మంది పోటీపడే ఈ పరీక్షలో తెలుగు యువత ఈ స్థాయి విజయాలు సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పూర్తి ఫలితాల జాబితాను బజూంఎ.ౖశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

# అభివృద్ధి విషయంలో రాజకీయాలొద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

నేను సీఎం అయిన తర్వాత రేషన్ కార్డు ఇచ్చా. సన్నబియ్యం ఇచ్చా. ఫ్రీ బస్సు పథకం ఇచ్చా. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మహిళలంతా నిండు మనసుతో ఆశీర్వదించాలని



అన్నారు.మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం. అభివృద్ధి విషయంలో రాజకీయాలు లేవు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదు. అందర్నీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్వాలగూడలో ఎకో హిల్ పార్క్ ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బుద్వేల్ లేఅవుట్‌తో కలిపే రేడియల్ రోడ్-2 ఇంటర్‌చేంజ్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమానికి
శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి,ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,మల్లు రవి,ఎంఎల్ ఏలు ప్రకాష్ గౌడ్, మల్‌రెడ్డి రంగా రెడ్డి ,సీఎం మాజీ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులుహాజరయ్యారు. ఈ సందర్భంగా ఎకో హిల్ పార్క్ ను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించి పరిశీలించారు.

# తెలంగాణ సొమ్ముతో కేరళలో ప్రచారం


**(మొదటి పేజీ తరువాయి)**

ఒక ఏటీఎంలా మారిందని అర్థమవుతోందని తెలిపారు.

ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ నమ్మించి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇక్కడ ప్రజల గొంతు కోసి, కేరళలో కలర్ పేజీల్లో యాడ్స్ ఇస్తోందని విమర్శించారు. ఇక్కడ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే తెలివి లేదు గానీ, ప్రకటనల పేరిట తెలంగాణ ప్రజల ధనం కేరళలో వృధా చేస్తారా?అని ప్రశ్నించారు. ఆడబిడ్డల కంట్లో మట్టికొట్టి కేరళ పత్రికల్లో మాత్రం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేశామంటూ దొంగ ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయకపోగా విద్యార్థులపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడుతున్నారని తెలిపారు. బడుల్లో చదువుకునే పిల్లలకు కనీస వసతులు లేవని పేర్కొన్నారు. ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి కొర్రీలు పెట్టి సగానికి పైగా రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసాను రెండు సీజన్లకు ఎగ్గొట్టిందని తెలిపారు.కనీసం యూరియా సరఫరా చేసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్ రూ.నాలుగు వేలకు పెంపును గాలికొదిలేశారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్‌ను చెల్లించడం చాతగాని కాంగ్రెస్ ప్రభుత్వం కేరళలో మాత్రం అద్భుత పాలన అంటూ ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు. అధిష్టానాన్ని మెప్పించడానికి తెలంగాణ ఖజానాను కాంగ్రెస్ అక్షయ పాత్రగా మార్చారని తెలిపారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లు తుడువలేని సీఎం రేవంత్‌రెడ్డి కేరళలో ప్రచారం కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేయడం శోచనీయమని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాయలో కేరళ ప్రజలు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇతర రాష్ట్రాల్లో దొంగ ప్రచారాలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

# లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

**(మొదటి పేజీ తరువాయి)**



మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది.

కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది.ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అధికారాలను నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్‌హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హోర్ముజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం · తెలుగు దినపత్రిక
శనివారం 7 మార్చి 2026

# సంకటహర చతుర్థి సందర్భంగా పట్టణంలోని గణేష్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



**ప్రజావినికిడి,(షాద్‌నగర్):**పాల్గుణ మాసం సంకష్టహర చతుర్థి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని వినాయక గంజ్ 20వ,గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవాలయంలో ముందుగా వినాయకుడికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించగా అనంతరం శివయ్యకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ దంపతులు, కౌన్సిలర్లను శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి గజానంద్ మరోటియా అన్నదాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మల గారి సత్యనారాయణ, 28వ వార్డ్ కౌన్సిలర్ లక్ష్మీ ప్రసన్న వేణుగోపాల్,12వ వార్డ్ కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్,20వ వార్డ్ కౌన్సిలర్ పినమోని గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# సుధాకర్ ఆధ్వర్యంలో రాబోతున్న పలు వెబ్ సిరీస్ పూజ కార్యక్రమం లో పాల్గొన్న చైతన్యపురి బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
శుక్రవారం రోజు ఫణిగిరి కాలనీ లక్ష్మీ నరసింహ స్వామి గుడిలో పలు సినిమాల సినిమాటోగ్రాఫర్ సుధాకర్ ఆధ్వర్యంలో మొదలువ్వబోతున్న పలు వెబ్ సిరీస్ పూజ కార్యక్రమంలో పాల్గొన్న చైతన్యపురి బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి.ఈ సందర్భంగా ఓనర్ అమ్మాయి వెబ్ సిరీస్ కథను డైరెక్టర్ కి అందజేసి నటులకు,టీమ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి,అజయ్, లక్ష్మణ్, నిరంజన్,జలంధర్ నరేష్,శ్రీధర్ తదితరులు పాల్గొనడం జరిగింది.



# ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' పై అవగాహన సదస్సు**






**ప్రజావినికిడి ,(రంగారెడ్డి):**
ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పి. మహేందర్ రెడ్డి,జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి,మను చౌదరి, దీపక్ తివారి,మల్కాజిగిరి,సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.కార్యక్రమంలో ప్రధాన అంశాలపై చర్చించి అధికారులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజా ప్రతినిధులు, అధికారులు జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని ఆయన పేర్కొన్నారు.

జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వాటి అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, 99 రోజుల కార్యక్రమంలో 10 అంశాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రజల వద్దకే వెళ్తారని తెలిపారు. రేషన్ కార్డులు,ఇళ్లు లేని నిరుపేదలకు ఇండ్ల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించినట్లు వెల్లడించారు. హౌసింగ్ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామపంచాయతీల్లో నీటి కొరత లేకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్,కాలే యాదయ్య, వీర్లపల్లి శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి,జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మంచి నీటి సరఫరా లో ఇబ్బంది లేకుండా చూడాలి..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**పబ్లిక్ హెల్త్,రోడ్డు భవనాల శాఖ,భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే**

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
నియోజకవర్గంలో వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను షాద్ నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజు నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు.

మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,

ఎక్కడైనా సరే పైప్ లైన్ లీకేజి జరిగితే తక్షణమే స్పందించి లైకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి నివేదిక అందించాలని అధికారులను కోరారు. అమృత్ స్కీమ్ లో భాగంగా





చేపడుతున్న ట్యాంక్ ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కోరారు. అదేవిధంగా మిగిలిన పైప్ లైన్ కనెక్షన్ తో పాటు ట్యాప్ కనెక్షన్లు కూడా త్వరగా ఇవ్వాలని కోరారు.షాద్ నగర్ పట్టణంలో పైప్ లైన్ తవ్వకాలు,కేబుల్ లైన్ తవ్వకాలు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, అనుమతులతో జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కవిత,రోడ్డు మరియు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సందీప్,అబ్దుల్ బారి,అన్ని మండలాల మిషన్ భగీరథ గ్రిడ్,ఇంట్రా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,మున్సిపల్ డిఇ నరేష్,పబ్లిక్ హెల్త్ డిఇ సాజిద్ ,ఇలియాస్ పాల్గొన్నారు.

# థీమ్ పార్కు అందుబాటులోకి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని మొట్టమొదటి మహిళా థీమ్ పార్కు పనులు చివరిదశకు చేరుకున్నాయి.త్వరలోనే అందుబాటులోకి: ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి.. బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ ఎన్జీవోస్‌కాలనీ,సచివాలయనగర్ కాలనీ నర్సరీ పార్కులో రూ.రెండు కోట్ల 70 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ఉమెన్స్ థీమ్ పార్క్‌ను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ,ఇట్టి పార్క్ తుదిదశకు రావడం జరిగింది అని తెలిపారు.అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకుంటున్న థీమ్ పార్కును పచ్చదనంతో పాటు వివిధ రకాల పూల మొక్కలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం జరిగింది అని తెలిపారు.వాకింగ్ ట్రాక్,విశాలమైన స్థలంలో బెంచీల ఏర్పాటు,మహిళల కోసం యోగా,కరాటే,మెడిటేషన్ తదితర వసతులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ పార్కులు మహిళలకు విశ్రాంతి వినోదం కోసం సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తాయి.అలాగే చిన్నారులు ఆడుకోవడానికి క్రీడా పరికరాలు,మహిళల కోసం ఓపెన్ జిమ్ నిర్మించడం జరుగుతుంది అని అన్నారు.ఈ పార్క్ కేవలం మహిళలకు చిన్న పిల్లలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ భారస అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి,అనిల్ చౌదరి,ముద్దగోని సతీశ్ గౌడ్,జక్కిడి రఘువీర్ రెడ్డి,నీలరాజు,కొంగర మహేష్,పొగుల రాంబాబు,వర్దని,వాణి,కౌసర్,శివనాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ మున్సిపాలిటీలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక

**99 రోజుల కార్యాచరణ ప్రారంభం**

**కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**సిడిఎంఏ డైరెక్టర్ జీ.మమత**

**కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి**




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
పట్టణ అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమ ప్రారంభోత్సవ కార్యక్రమం షాద్ నగర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు.మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే విల్లుపల్లి శంకర్ ప్రారంభించారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.డి.ఎం.ఏ డైరెక్టర్ మమత కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ,99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి,పారిశుధ్యం,ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ పాల్గొన్నారు.షాద్ నగర్ పురపాలక సంఘం సమావేశాన్ని నిర్వహించగా పలువురు కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు.కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి చర్యలపై చర్చించడంతో పాటు,వచ్చే 99 రోజుల్లో అమలు చేయనున్న పనులపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు.





ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మాకు అనుమతులు అక్కర్లేదు.. అంతా మా ఇష్టం..

## షాద్ నగర్ బైపాస్ రోడ్డులో చెట్ల నరికివేత..

**నరికి వేసిన చెట్లు ఎక్కడ.?**

**బైపాస్ రోడ్డులో చెట్లను నరికి వేసిన విద్యుత్ కాంట్రాక్టర్**

**అసలు అటవీశాఖ అధికారులు అనుమతులు ఉన్నాయా?**

**అనుమతుల బేఖాతరు వెనుక మర్మం ఏమిటి?**

**దీనికి సమాధానం ఇవ్వాల్సింది ఎవరు?**

**బాధ్యత వహించాల్సింది ఎవరు?**

**చెట్ల నరికివేతకు కారణమైన వారిపై చర్యలేవి?**





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**మాకు అనుమతులు అక్కర్లేదు,అంతా మా ఇష్టం అనే చందంగా అవి చెట్లే కదా,నరికి వేస్తే అడిగే వారు ఉండరేమోనని అనుకున్నారో ఏమో షాద్ నగర్ బైపాస్ రోడ్డులో దూసకల్ కు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను పూర్తిగా వేర్లతో సహా నరికివేసి ఎక్కడికో తరలించారు.

ఒకవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వృక్ష సంపద పెంపునకై కోట్ల రూపాయలు ఖర్చు చేసి పర్యావరణాన్ని రక్షించాలని, పర్యావరణంలో సమతుల్యత తీసుకురావాలని, మానవ జీవితం నిలబడడానికి కారణభూతమైన ఆక్సిజన్ అందించే చెట్లను విరివిగా పెంచాలని వృక్షో రక్షతి రక్షితః అని మానవ మనుగడకే ఆధారభూతమైన చెట్లను కాపాడాలని ప్రకటనలు ఇస్తూ చెట్లను పెంచడానికి కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తూ ప్రభుత్వపరంగా తమ వంతు బాధ్యత నిర్వహిస్తుంటే, షాద్ నగర్ పట్టణంలోని బైపాస్ రోడ్డులో చెట్లను నరికివేసి ఎక్కడికి తరలించారో కూడా తెలియకుండా మమ్మల్ని ఎవరు అడుగుతారులే అనే ధైర్యంతో కొందరు కాంట్రాక్టర్లు విచ్చలవిడితనానికి పాల్పడుతున్నారు.

వాల్టా చట్టం ప్రకారం చెట్లను నరకడానికి అటవీ శాఖ అనుమతులు తీసుకోవాల్సింది మరిచిపోయి, అటవీ శాఖ అనుమతులు లేకుండా అటవీ శాఖ అనుమతులు లేకుండా రోడ్డు కిరువైపులా ఉన్న చెట్లను తొలగించి వేస్తే ఇప్పటిదాకా అటవీ శాఖ అధికారులు కూడా మౌనం పాటించడం,చెట్ల నరికివేత పై చర్యలు తీసుకోకపోవడంలో మతలబు ఏమిటో అధికారులే తెలిపాల్సి ఉంది. వాల్టా చట్టం ప్రకారం పది చెట్లు నాటిన తర్వాతనే ఒక చెట్టు నరకాలనే నిబంధనలు, చెట్లను నరికితే వాటిని ప్రాంతీయ అటవీ కార్యాలయానికి తరలించాలని పలు నిబంధనలు ఉన్న,వాటిని పాటించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఒక్క మొక్కను పెంచడానికి ప్రభుత్వాలు సుమారుగా 1000 (వెయ్యి ) రూపాయల పైగా ఖర్చు చేసి అది పూర్తిగా ఎదిగి ఎంతోమంది జీవితాలకు ప్రాణవాయువు ఆక్సిజన్ అందే విధంగా,రోడ్డుపైన వెళ్లే బాటసారులకు నిలువు నీడ ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణ జరగాలనే ఉద్దేశంతో రోడ్డు కిరువైపులా చెట్లను నాటి పెంచి పోషించి పెద్ద చేస్తే, బాటసారులకు నిలువు నీడనిచ్చే ఆ చెట్లను తమ ఇష్ట రాజ్యంగా వేర్లతో సహా నరికివేసి తమ పనులు తాము చేసుకుంటూ పోతుంటే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కిమ్మనకుండా ఉండడం ఎంతవరకు సమంజసమో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా ఈ విషయంపై అటవీశాఖ అధికారులు స్పందించి చెట్ల నరికివేతకు కారణమైన కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు ఆశిస్తున్నారు.ఈ విషయంపై అటవీ అధికారులను సంప్రదిస్తే చెట్ల నరికివేతకు సంబంధించి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదని, ఒకవేళ అనుమతులు తీసుకున్న నరికి వేసిన చెట్లను అటవీ శాఖ కార్యాలయానికి తరలించాలని, అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని,అనుమతులు లేకుండా చెట్లను నరికి వేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## న్యూ సైన్సు కాలేజ్ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం

### పూర్వ విద్యార్థిగా హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
హైదరాబాద్ రాంకోట్ లోని న్యూ సైన్సు కాలేజ్ 1967 – 1970 బ్యాచ్ బీఎస్సీ విద్యార్థులు 56 ఏళ్ల తర్వాత కలుసుకొని నాటి కాలేజ్ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్, ఫతేహ్ మైదాన్ క్లబ్ లో శుక్రవారం న్యూ సైన్సు కాలేజ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్నేహం చిరకాలం నిలిచే బంధం అని మరోసారి నిరూపితమైన సందర్భంగా, ఫతేహ్ మైదాన్ క్లబ్ ఒక భావోద్వేగ వేదికగా మారింది. తమతమ జీవితాలలో జరిగిన తమ అనుభవాలు, అనుభూతులను, తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను వారు గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థిగా హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి హాజరై తనతోపాటు చదువుకున్న కాలేజ్ మిత్రులతో ఆత్మీయంగా పలుకరించి,పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. తనతోపాటు చదువుకున్న తోటి విద్యార్థులు శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లుగా, వ్యాపార వేత్తలుగా సాధించిన తమ ప్రతిభను సమాజానికి అందేటట్లు కృషి చేయడం అభినందనీయం అని అన్నారు.ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు బి.రెడ్డి శేఖర్ రెడ్డి, ఏం.మోహన్ రెడ్డి, ఏం. సత్యనారాయణ, పి.విజయ్ కుమార్,జి. జవహర్,జి.ఎన్. విజయ్ కుమార్ రెడ్డి,డా.ఎస్.ఏం. మాసూమ్,పి. శ్రీనివాస్ గౌడ్, డి.వై.దినేష్, జి.వి.కిష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర అధ్యక్షులు. కర్రి సునీల్ కుమార్,పూర్వ గౌరవ అధ్యక్షులు టి ఎన్.వంశీకృష్ణ తిలక్ డిమాండ్ చేశారు.ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల దళిత పోరం ఆధ్వర్యంలో ఏర్పటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఫిబ్రవరి 23న హైకోర్టు ఉద్యమకారులకు పెన్షన్,ఇంటి స్థలాలు..ఐడెంటి కార్డు..తగు సదుపాయాలను 8 వారాలలోపు. అమలు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆదేశించింది. ఇప్పటిదాకా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల గురించి మాట్లాడకపోవడం చాలా బాధాకరమని అన్నారు.ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులకు మోసం చేసింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేస్తుందని అన్నారు. దళితులంటే ఎస్సీలు,బీసీలు, ఎస్టీలు..మైనార్టీలు అగ్రవర్ణ పేదలందరూ కూడా తెలంగాణలో దళిత సామాజిక వర్గానికి వస్తారని అన్నారు.ఇలాంటి నిరుపేదలకు తీవ్రంగా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. రామన్న మాట్లాడుతూ, ఉద్యమ కారులను ఏ పార్టీలు కూడా పట్టించుకొవడం లేదని అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశంలో ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో బాలయ్య,డాక్టర్ మహిపాల్, ఉద్యమకారుడు మహేష్ రెడ్డి, మాస్టర్ విక్రమ్,కేబి శ్రీధర్, మాతృదేవోభవ భాస్కర్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుండె వైద్య రంగంలో కీలక మైలురాయిని చేసిన గ్లెనీగిల్స్ ఆస్పత్రి




**ప్రజావినికిడి, (బషీర్ బాగ్):** గుండె వైద్య రంగంలో కీలకమైలురాయిని గ్లెనీగిల్స్ ఆస్పత్రి వైద్యులు తొలిసారి ట్రాన్స్‌కాథెటర్ ట్రైకస్పిడ్ వాల్వ్ ఎడ్జ్ టు ఎడ్జ్ రిపేర్ చికిత్సను విజయంతంగా నిర్వహించారు. చాలా తీవ్రమైన గుండె సమస్యతో బాధపడుతున్న 75 ఏండ్ల రోగికి చికిత్సను అందించారు. డాక్టర్ ఎం.సాయి సుధాకర్ నేతృత్వంలో వైద్య బృందం ఈ ప్రక్రియను చేపట్టింది.దేశంలో స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన టీర్ వ్యవస్థ 'మైక్లిప్'ను అమర్చడం కూడా ఇదే తొలిసారి. ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సకు అనుకూలం కానీ, అధిక ప్రమాదం ఉన్న రోగులకు సులభమైన విధానంలో అందుబాటులోకి వచ్చిన సరికొత్త చికిత్సని వైద్యులు అన్నారు. ట్రైకస్పిడ్ వాల్వ్ వ్యాధి నిర్ధారణలో చాలాకాలంగా లోపాలున్నాయి. చికిత్సలో పరిమిత అవకాశాలే ఉన్నాయి. ముఖ్యంగా వృద్ధులు,అధిక ప్రమాదం ఉన్న రోగులు ఎక్కవగా ఇబ్బందులు ఎదర్కొంటారు. అలాంటి పరిస్థితిలో ఈ విధానం కీలక ముందడుగు వేస్తుందని డాక్టర్ సాయి సుధాకర్ తెలిపారు.ఓపెన్ హార్ట్ శస్త్ర చికిత్సకు అనుకూలం కాని రోగులు తీవ్రమైన శ్వాస ఇబ్బంది, వాపు,అలసటతో బాధపడుతూ ఉంటారు.ట్రాన్స్ కాథెటర్ ట్రైకస్పిడ్ వాల్వ్ ఎడ్జ్ టు ఎడ్జ్ రిపేర్ విధానంతో కాథెటర్ ఆధారంగా చిన్ని క్లిప్ పరికరాన్నిఅమర్చుతారు.దీంతో వాల్వ్ లీఫ్‌లెట్లు దగ్గరగా చేరుతాయి.రక్తం వెనక్కి ప్రవహించే సమస్య పూర్తిగా తగ్గుతుందని డాక్టర్ సాయి సుధాకర్ వివరించారు. వృద్ధుడికి చేసిన చికిత్సలో కాథ్‌ల్యాబ్, ఇమేజింగ్, అనస్తీషియా, నర్సింగ్, క్రిటికల్ కేర్ బృందాలు సమన్వయంతో పని చేశాయని తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి :ఏఐఎస్ఎఫ్ డిమాండ్

### మండల విద్యాధికారి (MEO) కు వినతి పత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు.

### ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ఫరూఖ్‌నగర్ మండలంలో రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చకుండా,నిబంధనను అతిక్రమించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఫరూఖ్‌నగర్ మండల సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాధికారి మనోహర్ కి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ, ఫారుక్ నగర్ మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, పాఠశాల ప్రాంగణాల్లోనే బుక్స్, యూనిఫార్మ్ విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా వేధిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం వీటి అమ్మకాలను నిషేధించినా,ఫరూఖ్‌నగర్ మండలంలో తనిఖీలు లేకపోవడం వల్లే యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయని ఆరోపించారు.



**ఏఐఎస్ఎఫ్ ప్రధాన డిమాండ్లు**

పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫార్మ్ విక్రయాలను తక్షణమే నిలిపివేయాలి.

అనుమతి లేకుండా అడ్డగోలుగా పెంచిన ఫీజులను నియంత్రించాలి.నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి.విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేపట్టాలి.ఫీజుల నియంత్రణపై అధికారులు కఠినంగా వ్యవహరించకపోతే,విద్యార్థులు మరియు తల్లిదండ్రులతో కలిసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## వాలి బాల్ టోర్నమెంట్ ప్రారంభించిన పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్



**ప్రజావినికిడి,(వాజేడు):మర్చి 6**
టేకులగూడెం గ్రామంలో సువిద వికాస్ ట్రస్ట్, అష్ణగూర్తి,వారి ఆర్థిక సహకారంతో భీస్మ శంకర యూత్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిథిగా పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ వాలీబాల్ టోర్నమెంట్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి వారందరికీ పలు సలహాలు చూసినలు చేసారు ఈ టోర్నమెంట్ లో 4 మండలాల నుండి క్రీడాకారులను ఆహ్వానించడం జరిగింది.అని వారు తెలిపారు మొదటి బహుమతి 20,016, కప్,అందజేస్తారు రెండవ బహుమతిగా 10,016 కప్ అందజేయ్యనున్నారు ఈ కార్యక్రమం లో సర్పంచ్ చిడెం బాలకృష్ణ,మాజీ సర్పంచ్ వాసం ఆనందరావు, గ్రామ పెద్దలు కుర్సం దక్షణమూర్తి,కోడె నారాయణ, యువకులు వాసం పవన్,కుర్సం దామోదర్,వాసం దిలీప్,కుర్సం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శేర్లింగంపల్లి సర్కిల్49లో ఏసీబీ సోదాలు

**ప్రజావినికిడి,(శేర్లింగంపల్లి):**
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని శేర్లింగంపల్లి సర్కిల్49 కార్యాలయంలో శుక్రవారం ఉదయం నుంచి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. సర్కిల్ కార్యాలయంలోని పలు విభాగాల్లో ఒకేసారి తనిఖీలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

ఏసీబీ డీఎస్పీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం, సర్కిల్ పరిధిలో ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంపై అనేక ఫిర్యాదులు అందాయి.వాటి ఆధారంగా ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన అనంతరం సోదాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ప్రస్తుతం టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల్లో పత్రాలు, రికార్డులను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.




ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారులను ఏసీబీ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలోనే ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.సిపి శ్యామ్ కుమార్, ఏసిపి వెంకట్ రమణ,సెక్షన్ ఆఫీసర్ అక్బర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోందని, అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం పూర్తి వివరాలను శనివారం వెల్లడిస్తామని డీఎస్పీ ఆనంద్ తెలిపారు. సోదాలు కొనసాగుతున్న నేపథ్యంలో కార్యాలయంలో సిబ్బంది, స్థానికుల మధ్య ఆసక్తి నెలకొంది.

అవినీతి ఆరోపణలపై ఏసీబీ అధికారులు లోతైన విచారణ చేపడుతున్నట్లు సమాచారం. విచారణ అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.



# కెసిఆర్‌ను కలిసిన బాల్క సుమన్

**హైదరాబాద్,మార్చి6ప్రజావినికిడి** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం కలిశారు. ఇటీవల క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చిన బాల్క సుమన్ తొలిసారి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్నికల్లో ఎంతో ధైర్యంగా , సమర్థవంతంగా పనిచేసి మెజారిటీ సభ్యులను గెలిపించు కున్నందుకు, కాంగ్రెస్ దౌర్జన్యాలను తిప్పికొట్టినందుకు బాల్కసుమన్‌ను అభినందించారు. మున్సిపల్ ఎన్నికలు జరిగి నెలరోజులు కావస్తున్నా క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నికకు కాంగ్రెస్ అడ్డం పడుతుంది. మెజారిటీ లేకున్నా బలప్రయోగం, బెదిరింపులతో హస్తగతం చేసుకోవాలని నానా ప్రయత్నాలు చేస్తుంది. ఇందులో భాగంగా క్యాతన్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ , సీపీఐ అభ్యర్థులు 14 మంది గెలుపొందారు. ఇక సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక లాంఛనమే అన్న తరుణంలో కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, మంత్రి వివేక్ ,ఎంపీ పోలీసుల సహకారంతో అడ్డుపడుతూ వచ్చారు. చివరకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలులు పెట్టారు.సుమారు 16 రోజుల పాటు బెయిల్ దొరకకుండా అడ్డుపడ్డారు. రెండు రోజుల క్రితం జైలు నుంచి బయటకు వచ్చిన బాల్కసుమన్ నిన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కెసిఆర్‌ను కలిసి తాజా పరిణామాలను బాల్క వివరించారు.

# శ్రీవారిని దర్శించుకున్న కవిత దంపతులు

## నలుగేళ్ల మనోవేదనకు తెరపడిందని ఆనందం



**తిరుమల,మార్చి6ప్రజావినికిడి**

నాలుగేళ్లుగా తాను పడుతున్న మనోవేదన వేంకటేశ్వరస్వామి దయతో తీరిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆమె దర్శించుకున్నారు. తన భర్తతో కలిసి శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. దిల్లీ మద్యం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించేందుకు కాలినడకన వచ్చానన్నారు. త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు వెల్లడించారు. తనకు కష్టకాలంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్వామి దయ తనపై ఉండడం వల్లనే కేసు నుంచి బయటపడ్డానని అన్నారు.

----

# గల్ఫ్‌కు వెళ్లే 12 విమానాలు రద్దు

హైదరాబాద్,**మార్చి6ప్రజావినికిడి** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 12 విమానాలు రద్దయ్యాయి. అదే సమయంలో గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మరో 12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు రద్దు అయినట్లు అధికారులు తెలిపారు.

---------

# మూడు వారాల్లో క్యాతన్ పల్లి ఎన్నిక

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్,**మార్చి6ప్రజావినికిడి** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్ధంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతనపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.

# 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్

**సోషల్ మీడియాతో పిల్లలు నష్టపోవడానికి వీల్లేదు**

**అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం**

**25 నూతన పాలసీలతో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం**


**3 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం**

**పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం**

**స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్**

**లడ్డూ కల్తీ జరిగినా ఇంకా క్షమాపణలు చెప్పరా**

**అసెంబ్లీలో ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో సిఎం బాబు**



**అమరావతి మార్చి6ప్రజావినికిడి** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు.

సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవద్దనే సంకల్పానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్నారు. స్వప్రయోజనాల కోసం సాంకేతికతను ఉపయోగించుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని , దానికి బానిసై చెడుకు ఉపయోగిస్తే నాశనమవుతారని అన్నారు. 13 ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చిందని, వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతామని, 13-16 ఏళ్ల లోపు వారికి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు.

రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నీస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామన్నారు. యోగా, నేచురోపతి లాంటి అంశాలను మేళవించి ప్రజారోగ్యాన్ని కాపాడతామని తెలిపారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్తే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6-7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి నైవేద్యం కల్తీ చేసి క్షమాపణలు చెప్పరా అని నిలదీశారు. మత సామరస్యాన్ని గౌరవిస్తూ క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా అన్ని పథకాలు కొనసాగిస్తున్నామని, వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు.

# జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం

**వైసిపి వల్ల 30 ఏళ్లు వెనక్కి వెళ్లిన రాష్ట్రం**

**ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్**

**ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ. 3.32లక్షల కోట్ల బడ్జెట్**

**పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం**

**వైసిపి విద్యుత్ కొనుగోళ్లతో రూ.12,250కోట్ల నష్టం**

**విద్యుత్ సంస్థలకు రూ.1.29 లక్షల కోట్లు నష్టం**

**రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగం**

**రాష్ట్రాన్ని నిలబెట్టాలనే కూటమి కోసం పాటుపడ్డా**

**ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**



**అమరావతి,మార్చి6ప్రజావినికిడి**

జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు. ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. బడ్జెట్ లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ.1.29 లక్షల కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని.. ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని.. అందులో రూ.25వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పుకొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వైసీపీకి 11మంది సభ్యులున్నా 11వందల మంది ఉన్నట్లుగా మాట్లాడుతారని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు చెప్పే అసత్యాలు కూడా ప్రజలు నిజాలని బలంగా నమ్మే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఇతరుల స్వేచ్ఛను, హక్కులను హరించటం తమ హక్కని వైసీపీ భావిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి అసభ్య పదజాలంతో మాట్లాడే వారిని కట్టడి చేయాలని కోరారు. దోపిడి చేసే దొంగ పోలీసులను చూసి.. దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ అండ్ కో తీరు ఉందని సెటైర్లు గుప్పించారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు.కల్తీ వాళ్లే చేస్తారని... నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై మోపుతారని పవన్ కల్యాణ్ ఆగ్రహించారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలవాలన్నా.. అన్ని కులాల వాళ్ల ఓట్లు వేయాల్సిందేనని తెలిపారు. ఈ మధ్య కొందరు ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటున్నారని ఫైర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటే రాష్ట్రం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం దాటకపోతే ఏపీ విచ్ఛిన్నమవుతుందని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా మనమే చెప్పాలని అన్నారు. లేకపోతే ఎంత బడ్జెట్ పెట్టినా ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. పోలవరం, అమరావతిని వైసీపీ పక్కన పెట్టిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలందరం ఐక్యంగా ముందుకెళ్దామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కూటమి చాలా బలంగా ఉండాలనేది తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఏపీ అభివృద్ధి కోసమే 2014లో అలయన్స్ కోసం కష్టపడ్డానని తెలిపారు. 2019లో అది సాధ్యం కాలేదని.. 2024లో మరోసారి వెనక్కు తగ్గి పొత్తు పెట్టుకున్నానని ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలంటే మనలో ఏదైనా చిన్నచిన్న సమస్యలున్నా సర్దుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగంలోని మూడు వ్యవస్థలు పరస్పర సహకారంతో పని చేయాలని తెలిపారు. ఏ వ్యవస్థలో లోపాలు ఏర్పడినా ప్రజలకు సేవ చేయటంలో ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. జగన్ అండ్ కో కుట్రలను ఎదుర్కోవాలంటే మనం కలిసి ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిధులను పారదర్శకంగా ఖర్చు చేశామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ఎవరొచ్చినా వారు అడిగింది ఇవ్వటానికి తాను ప్రయత్నించానని పేర్కొన్నారు.

# బేగంపేట వాతావరణ శాఖ కార్యాలయానికి బాంబు బెదిరింపు

### తనిఖీలు చేపట్టి ఫేక్ కాల్‌గా గుర్తింపు

**హైదరాబాద్,మార్చి6ప్రజావినికిడి** ఇటీవల విమానాశ్రయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు 'ఫేక్ బాంబ్ బెదిరింపులు' రావడం ఎక్కువైంది. తాజాగా.. హైదరాబాద్‌లోని బేగంపేటలో బాంబు బెదిరింపు కలకలం రేపింది. వాతావరణ శాఖ కార్యాలయానికి వచ్చిన ఈ బెదిరింపుతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. వెంటనే కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. అయితే బాంబు బెదిరింపుతో కార్యాలయంలోని సిబ్బంది, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ కేంద్రానికి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు రావడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు కార్యాలయం అంతటా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. నిత్యం వాతావరణ సమాచారంతో బిజీగా ఉండే అధికారులు, సిబ్బంది ఈ ఆకస్మిక పరిణామంతో తీవ్ర టెన్షన్‌లో ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సిబ్బందిని కార్యాలయం బయటకు పంపినట్లు సమాచారం. ఇటీవల 'ఫేక్ బాంబ్ బెదిరింపులు' రావడం ఎక్కువైంది. ఇది కూడా అలాంటి ఆకతాయిల పని అయి ఉంటుందని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, పోలీసులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తనిఖీలు కొనసాగిస్తున్నారు. ప్రజలు భయాందోళన చెందవద్దని, పోలీసులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. నిందితులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం.

# అమెరికా ఆస్తులపైనే మా దాడులు

### అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు

### ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే

న్యూఢిల్లీ,**మార్చి6ప్రజావినికిడి**




పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు. యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా-75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. 'ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది' అని అన్నారు.

--------------

# పశ్చిమాసియా యుద్ధంలో బాలలు బలి

### 200 మంది వరకు చనిపోయినట్లు యూనిసెఫ్ ప్రకటన

న్యూఢిల్లీ,**మార్చి6ప్రజావినికిడి**




అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

------------

# ఎపి శాసనసభ నిరవధిక వాయిదా

### 15 రోజులు సమావేశాలు జరిగాయి

### వివరాలు వెల్లడించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



అమరావతి,**మార్చి6ప్రజావినికిడి**

ఏపీ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు జరిగేందుకు సహకరించిన అందరికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృతజ్ఞతలు తెలిపారు. 16వ శాసనసభ ఐదో సమావేశాలు 15 రోజుల పాటు జరిగాయన్నారు. 72 గంటల 14 నిమిషాల పాటు సమావేశాలు జరిగాయని స్పీకర్ తెలిపారు. మొత్తం 122 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారని... 80 ప్రశ్నలకు సభాసమక్షంలో ఉంచారని చెప్పారు. ఈసారి సమావేశాల్లో 18 బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఒక లఘు చర్చ, 344వ నియమం కింద చర్చించిన అంశాలు ఒకటి అని వివరించారు. శాసనసభలో టీడీపీ- 135, జనసేన-21, వైసీపీ-11, బీజేపీ-8 మంది సభ్యులున్నారని స్పీకర్ తెలిపారు. ఈరోజు సాయంత్రం సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా రావాలని స్పీకర్ కోరారు. క్రీడాపోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 166 పాఠశాలల నుంచి 6,693 విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారని.. అసెంబ్లీకి ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు ఎప్పుడూ రాలేదని స్పీకర్ అన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు.

# ఈ యుద్ధం ముగిసేదెలా ?

**మార్చి6ప్రజావినికిడి**



పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్పు ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది.ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెనువెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయ త్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్పు ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్ముజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహరణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.

# మరోమారు బొత్సకు అస్వస్థత

### బిపి హెచ్చు తగ్గులతో అలసట

### వెంటనే వైద్యులను పిలిపించి పరీక్షలు

అమరావతి,**మార్చి6ప్రజావినికిడి**



శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మరోమారు అస్వస్థతకు గురయ్యారు. సభలో ప్రసంగిస్తూ ఇబ్బందిపడటంతో అక్కడి అధికారులు అత్యవసరంగా అసెంబ్లీకి వైద్యులను పిలిపించారు. పరీక్షించిన వైద్యులు.. బీపీలో హెచ్చుతగ్గుల వల్లే అస్వస్థతకు గురైనట్లు వెల్లడించారు. ఆయనకు విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. వైద్యుల సూచన మేరకు బొత్స ఇంటికి బయల్దేరారు. సభలో ప్రసంగించేటప్పుడు పరిస్థితిని గమనించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన్ను విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం. అయితే మూడ్రోజుల విశ్రాంతి అనంతరం శుక్రవారమే బొత్స తిరిగి సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా

ఆయనను మంత్రి లోకేశ్ ఆత్మీయంగా పలకరించారు. 'బొత్స సత్యనారాయణ గారు నమస్కారం' అంటూ పలకరించారు. బొత్స సత్యనారాయణ వినకపోవడంతో వెంటనే కల్పించుకున్న చైర్మన్.. 'మంత్రి నారా లోకేశ్ మిమ్మల్ని పరామర్శిస్తున్నారు' అంటూ బొత్సకు తెలియజేశారు. వెంటనే మంత్రి మాట్లాడుతూ.. 'గురువుగారు చిన్న అనారోగ్య సమస్యతో బాధపడ్డారు. ఆయన తిరిగి ఆరోగ్యంగా హౌస్‌కు రావడం ఆనందంగా ఉంది' అని మంత్రి లోకేశ్ అన్నారు. ఇటీవల మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

# ఆహ్లాదకరంగా ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం..





విజయవాడ**మార్చి6ప్రజావినికిడి**

విజయవాడలో జరిగిన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాజకీయాలకు కాస్త విరామమిచ్చి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకలో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ ఆలపించిన ప్రార్థనా గీతం అందరినీ ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నేతలంతా ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందంగా సమయం గడిపారు.ముఖ్యంగా ఈ వేడుకలో మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అక్కడికి వచ్చిన ప్రజాప్రతినిధుల పిల్లలతో ఆయన సరదాగా ఆటలు ఆడుతూ సందడి చేశారు. అలాగే, ఇటీవల 'ఆటవిడుపు' పేరుతో ప్రజాప్రతినిధులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజయం సాధించిన విజేతలకు ఈ వేదికపై బహుమతులను అందజేశారు. కుటుంబాల కలయికతో సాగిన ఈ కార్యక్రమం నేతల మధ్య స్నేహభావాన్ని మరింత బలోపేతం చేసింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, శాసనసభ్యులు మరియు వారి కుటుంబాల కోసం మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. ఈ విందు ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.



# అర్షదీప్‌ను ఆటపట్టించిన అభిషేక్



ముంబయి వాంఖడే వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో భారత్ విజయం సాధించిన ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. మార్చి 08న నరేంద్రమోదీ స్టేడియంలో టైటిల్ ఫైట్‌లో న్యూజిలాండ్‌ను ఢీ కొట్టనుంది. అయితే ఫైనల్ మ్యాచ్ కోసం భారత క్రికెట్ జట్టు ముంబయి నుంచి అహ్మదాబాద్‌కు బయల్దేరింది. ఈ జర్నీలో టీమ్‌ఇండియా ఆటగాళ్లు అభిషేక్ శర్మ- అర్షదీప్ సింగ్ మధ్య సరదా సంభాషణ జరిగింది. దీనికి సంబంధించిన వీడియో నవ్వులు పూయిస్తుంది. సెమీఫైనల్‌లో అర్షదీప్ అంచనాలకు తగ్గట్టుగా రాణించలేదు. అతడి నాలుగు ఓవర్ల కోటాలో 51 పరుగులిచ్చి ఒకే ఒక వికెట తీశాడు. అంటే 12.80 ఎకనమీతో బౌలింగ్ చేశాడు. ఈ క్రమంలోనే అతడు మొత్తం 5 వైడ్ బాల్స్ వేశాడు. అయితే బౌలింగ్‌లో వైడ్లు వేయడంపై అభిషేక్ సరదాగా అర్షదీప్‌ను ఆటపట్టించాడు. అర్షదీప్ బౌలింగ్ చేస్తుంటే, జట్టులో ఇద్దరు వికెట్ కీపర్లు ఉండాలని అన్నాడు. టీమ్ బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో అభిషేక్‌ను అర్షదీప్ ఏదో అన్నాడు. దానికి బదులిస్తూ అభిషేక్, 'అర్షదీప్ నువ్వు బౌలింగ్ చేస్తుంటే మనకు ఇద్దరు వికెట్ కీపర్లు కావాలి. ఒకరు స్టంప్స్‌కు స్టయిట్‌లో ఉండాలి, ఇంకొకరు వైడ్ వద్ద కూడా కావాలి' అని నవ్వుతూ అన్నాడు. దీనికి అర్షదీప్ 'సంజు భాయ్, మనకు ఇద్దరు వికెట్ కీపర్లు కావాలా సరే ఏం ఫర్వాలేదు లే, మన జట్టులో ఇద్దరు కీపర్లు ఉన్నారు' అంటూ ఇషాన్ కిషన్‌ను చూపిస్తూ రిప్లై ఇచ్చాడు. దీనిని అర్షదీప్ తన సోషల్ మీడియా అకౌంట్ స్నాప్‌చాట్ స్టోరీలో పోస్ట్ చేయడంతో ఇది వైరల్ అయ్యింది. అయితే ఈ వరల్డ్‌కప్‌లో నిజంగానే అర్షదీప్ బౌలింగ్ ఆశించిన స్థాయిలో లేదు. సెమీస్ కంటే ముందు వెస్టిండీస్‌తో ఆడిన సూపర్ 8 మ్యాచ్‌లోనూ అతడి బౌలింగ్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఆ మ్యాచ్‌లో 4 ఓవర్లు బౌలింగ్ చేయగా, 43 పరుగులు ఇచ్చాడు. ఇందులో ఒక్క వికెట్ కూడా లేదు. అలాగే అతడు సంధించిన బంతుల్లో 7 వైడ్‌గా వెళ్లడం గమనార్హం. ఈ లెక్కన అర్షదీప్ ఆడిన చివరి రెండు మ్యాచ్‌ల్లోనే మొత్తం 12 వైడ్ బాల్స్ వేశాడన్నమాట! కాగా, ప్రస్తుత వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో అర్షదీప్ ఏడు మ్యాచ్‌ల్లో 9 వికెట్లు పడగొట్టాడు.



# చరిత్ర సృష్టించిన సంజూ శాంసన్..

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే సింగిల్ ఎడిషన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో రోహిత్ శర్మ రికార్డ్‌ను అధిగమించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఇప్పటి వరకు 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడిన సంజూ శాంసన్.. 16 సిక్స్‌లు బాదాడు. తద్వారా రోహిత్ శర్మ పేరిట ఉన్న 15 సిక్స్‌ల రికార్డును అధిగమించాడు. ఇంగ్లండ్‌తో గురువారం వాంఖడే వేదికగా జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ 7 సిక్స్‌లు కొట్టడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. లీగ్ దశలో నమీబియాతో ఒక మ్యాచ్ ఆడిన సంజూ శాంసన్.. సూపర్-8లో జింబాబ్వే, వెస్టిండీస్‌పై బరిలోకి దిగాడు. నమీబియాతో మ్యాచ్‌లో మూడు సిక్స్‌లు బాదిన సంజూ.. జింబాబ్వేతో రెండు, వెస్టిండీస్‌పై నాలుగు సిక్స్‌లు కొట్టాడు. రోహిత్ శర్మ 2024 టీ20 ప్రపంచకప్‌లో 15 సిక్స్‌లు బాది ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా.. సంజూ శాంసన్ అధిగమించాడు. సింగిల్ ఎడిషన్ టీ20 ప్రపంచకప్‌లో సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్ల జాబితాలో సంజూ శాంసన్(16) తర్వాత శివమ్ దూబే(15), రోహిత్ శర్మ(15), ఇషాన్ కిషన్(14), హార్దిక్ పాండ్యా(14), యువరాజ్ సింగ్ ఉన్నారు. ఇందులో రోహిత్(2026), యువరాజ్ సింగ్(2007) మినహా మిగతా బ్యాటర్లంతా ఈ ఎడిషన్‌లో సిక్స్‌లు బాదడం గమనార్హం. ఓవరాల్‌గా ఈ జాబితాలో ఫిన్ అలెన్ 20 సిక్సర్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. షిమ్రాన్ హెట్‌మైర్(19), ఫర్మాన్(18), నికోలస్ పూరన్(17) సంజూ శాంసన్ కంటే ముందున్నారు. న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్లో సంజూ తన జోరు కొనసాగిస్తే.. ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవనున్నాడు. ఈ ఎడిషన్‌లో నాలుగు మ్యాచ్‌లే ఆడిన సంజూ రెండు హాఫ్ సెంచరీలతో 232 పరుగులు చేశాడు. పేలవ ఫామ్‌తో తుది జట్టులో చోటు కోల్పోయిన సంజూ.. లెఫ్ట్ రైట్ కాంబినేషన్‌లో భాగంగా అవకాశం అందుకొని ఆకాశమే హద్దుగా చెలరేగాడు.

# 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'కి భారత్ నుంచి 'ఒకే ఒక్కడు'

2026 ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ క్లైమాక్స్‌కు చేరుకుంది. మార్చి 08న అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టైటిల్ ఫైట్‌లో భారత్ - న్యూజిలాండ్ తలపడనున్నాయి. అయితే ఐసీసీ నిర్వహించే ప్రతీ టోర్నమెంట్‌లో అత్యుత్తమంగా ప్రదర్శన కనబర్చిన ఆటగాడికి నిర్వాహకులు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు ఇస్తుంటారు. ఈ క్రమంలో ప్రస్తుత టోర్నీలోనూ ఆయా జట్ల నుంచి పలువురు ప్లేయర్లు అత్యుత్తమ ఆటతీరు కనబర్చారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఆయా విభాగాల్లో అద్భుతంగా ఆడి తమతమ జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించారు. మరికొందరైతే ఏకంగా వరల్డ్ రికార్డులు క్రియేట్ చేశారు. అయితే టోర్నీ ముగింపు దశకు చేరుకోవడంతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డుకు ఐసీసీ నామినీల పేర్లను రివీల్ చేసింది. మొత్తం 20 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో ఎనిమిది మంది పేర్లను 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డుకు ఐసీసీ పరిశీలిస్తుంది. ఈ మేరకు షార్ట్‌లిస్ట్ చేసిన లిస్ట్‌ను శుక్రవారం రిలీజ్ చేసింది. జాబితాలో ఉన్న ప్లేయర్లను ఓటింగ్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొంది. మెజార్టీ ఓటింగ్ దక్కించుకున్న ఆటగాడికి ఆదివారం ఫైనల్ మ్యాచ్ అనంతరం ఈ అవార్డును ఐసీసీ అందజేస్తుంది. అవార్డుతో పాటు ప్రైజ్‌మనీ కూడా ఉంటుంది. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో బ్యాటింగ్, బౌలింగ్ ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో ఇంగ్లాండ్ మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడగా అందులో ఆరింట్లో నెగ్గింది. అయితే ఆరు మ్యాచ్‌ల్లో నెగ్గిన సందర్భాల్లో నాలుగుసార్లు విల్ జాక్స్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'





అవార్డు దక్కడం విశేషం. 8 మ్యాచ్‌ల్లో 226 పరుగులు బాదగా, 9 వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ బ్యాటర్ షహిబ్‌జాదా ఫర్హాన్ ఈ రేస్‌లో ఉన్నాడు. అతడు ఈ టోర్నీలో అత్యధిక పరుగులు బాదిన బ్యాటర్‌గా టాప్‌లో ఉన్నాడు. అతడు ఆరు మ్యాచ్‌ల్లో 76.60 సగటుతో 383 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. అతడు శ్రీలంక, నమీబియాతో మ్యాచ్‌ల్లో శతకాలు నమోదు చేశాడు. అయితే సింగిల్ టీ20 వరల్డ్‌కప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు, అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్‌గానూ ఫర్హాన్ రికార్డ్ కొట్టాడు. సౌతాఫ్రికా సెమీఫైనల్‌కు చేరడంలో కీలక పాత్ర పోషించాడు పేసర్ లుంగి ఎంగ్డి. ఈ టోర్నీలో ఏడు మ్యాచ్‌ల్లో ఎంగ్డి పొదుపుగా బౌలింగ్ చేస్తూ 12 వికెట్లు నేలకూల్చాడు. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించాడు. ముఖ్యంగా కెనడాపై 4, అఫ్గానిస్థాన్‌పై ఉత్కంఠ మ్యాచ్‌లో 3 వికెట్లు దక్కించుకున్నాడు. సూపర్ 8లో భారత్‌పై వికెట్ పడగొట్టకున్నా నాలుగు ఓవర్ల కోటాలో కేవలం 15 పరుగులే ఇచ్చాడు. సౌతాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ కూడా నిలకడగా ఆడాడు. ఎనిమిది మ్యాచ్‌ల్లో మూడుసార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. తొలి మ్యాచ్‌లో కివీస్‌పై 86 పరుగులు బాది నాటౌట్‌గా నిలిచాడు. తర్వాత వెస్టిండీస్‌పైనా 86 రన్స్ చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొత్తం 286 పరుగులు చేశాడు. ఇక సూపర్ 8 లో భారత్‌తో మ్యాచ్‌లో జోరుమీదున్న ఇషాన్ కిషన్ వికెట్ పడగొట్టాడు. న్యూజిలాండ్ యంగ్ బ్యాటర్ రచిన్ రవీంద్ర ఈ టోర్నీలో బ్యాట్ కంటే ఎక్కువగా బంతిలోనే రాణించాడు. హిట్టర్‌గా పేరున్న రచిన్ పరుగులు తక్కువగానే చేసినప్పటికీ ఫుల్‌టైమ్ బౌలర్‌కు ధీటుగా వికెట్లు పడగొట్టి జట్టు విజయాల్లో కీలకం అయ్యాడు. తప్పక నెగ్గాల్సిన సూపర్ 8 పోరులో శ్రీలంకపై నాలుగు వికెట్లు పడగొట్టి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు.



# హార్దిక్ పాండ్యాపై ప్రశంసల జల్లు

ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన సెమీఫైనల్ పోరులో హార్దిక్ పాండ్యా అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇంగ్లాండ్‌పై భారత్ సాధించిన ఉత్కంఠభరిత విజయం తర్వాత టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ముఖ్యంగా ఆర్సీబీ దిగ్గజం, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ హార్దిక్ పాండ్యాను 'బిగ్ మ్యాచ్ ప్లేయర్'గా అభివర్ణించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం డుప్లెసిస్ మాట్లాడుతూ.. హార్దిక్ పాండ్యాలోని పోరాట పటిమను, క్లిష్ట పరిస్థితుల్లో అతను చూపించే సమయస్ఫూర్తిని కొనియాడారు. "ఒక ఆటగాడికి నైపుణ్యం ఎంత ముఖ్యమో, ఒత్తిడిని తట్టుకునే మనస్తత్వం కూడా అంతే ముఖ్యం. కొన్నిసార్లు టాలెంట్ కంటే ఆటగాడి క్యారెక్టర్‌ను బట్టి వారిని ఎంపిక చేయడం సరైన నిర్ణయం అవుతుంది. పాండ్యా అటువంటి క్యారెక్టర్ ఉన్న ప్లేయర్, అతను పెద్ద స్టేజ్ కోసమే పుట్టినట్లుగా కనిపిస్తాడు" అని డుప్లెసిస్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ తన విలువను నిరూపించుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌లో కేవలం 12 బంతుల్లోనే 27 పరుగులు (3 ఫోర్లు, 2 సిక్సర్లు) చేసి, భారత జట్టు స్కోరును 253 పరుగుల భారీ లక్ష్యం వైపు తీసుకెళ్లడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఆ తర్వాత బౌలింగ్‌లో అత్యంత కీలకమైన సమయంలో బరిలోకి దిగి, ఇంగ్లాండ్ బ్యాటర్లు ఫిల్ సాల్ట్, సామ్ కరన్‌ల వికెట్లను తీసి ప్రత్యర్థి జట్టును ఒత్తిడిలోకి నెట్టాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్ గెలుపు దిశగా సాగుతున్న సమయంలో హార్దిక్ వేసిన పెనాల్టీ ఓవర్ మ్యాచ్ గమనాన్నే మార్చేసింది. 41 ఏళ్ల డుప్లెసిస్ మాట్లాడుతూ, కోచ్‌లు ఆటగాళ్లను ఎంపిక చేసేటప్పుడు కేవలం టాలెంట్‌ను మాత్రమే కాకుండా, వారిలో ఉన్న 'ధైర్యాన్ని' డా చూస్తారని వివరించాడు హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లు ఒత్తిడి పెరిగే కొద్దీ మరింత మెరుగ్గా రాణిస్తారని.. అటువంటి ధైర్యం, క్యారెక్టర్ ఉన్న వ్యక్తులు జట్టుకు ఎంతగానో ఉపయోగపడతారని డుప్లెసిస్ అభిప్రాయపడ్డాడు. 2024 వరల్డ్ కప్‌లోనూ భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన హార్దిక్ పాండ్యా.. ఇప్పుడు 2026లో కూడా అదే జోరును కొనసాగిస్తూ టీమిండియాకు ప్రధాన ఆయుధంగా మారాడు. ఈ సెమీఫైనల్ విజయంతో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. హార్దిక్ పాండ్యా ప్రదర్శన అభిమానులకు, మాజీ ఆటగాళ్లకు కూడా ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.


# ఓడిపోయినా.. చివరి వరకు పోరాడాం.!

### ఇంగ్లాండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్

టీ20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై ఏడు పరుగుల తేడాతో టీమిండియా అద్భుత విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ కీలక మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఆటగాడు జాకబ్ బేతల్ టీం ఇండియా బౌలర్లపై చివరి వరకు ధైర్యంగా పోరాడాడు. అయితే, మ్యాచ్ చివరి దశలో భారత బౌలర్లు పరుగులను నియంత్రించడంలో, కీలక వికెట్లు తీయడంలో విజయవంతమయ్యారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా వేసిన రెండు ఓవర్లలో ఇంగ్లాండ్ బ్యాటర్లు పరుగులు రాబట్టడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుమ్రా ఓవర్‌లోనే జాకబ్ బేతల్ రనౌట్ అవ్వడం ఇంగ్లాండ్‌కు చావుదెబ్బగా మారింది. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు తీయడమే కాకుండా, సెంచరీ వీరుడైన జాకబ్ బేతల్‌ను రనౌట్ రూపంలో పెవిలియన్‌కు పంపడంలో కీలక పాత్ర పోషించాడు. అక్షర్ పటేల్ ఫీల్డింగ్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి టీం ఇండియా విజయానికి



దోహదపడ్డాడు. మ్యాచ్ అనంతరం ఇంగ్లాండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెక్‌కలమ్ తమ జట్టు ఓటమిపై స్పందించారు. "మేము విజయం కోసం చివరి వరకు పోరాడాం. చివరి ఓవర్లలో భారత బౌలర్లు పుంజుకోవడమే మా ఓటమికి ప్రధాన కారణం" అని ఆయన పేర్కొన్నారు. మ్యాచ్ ఆరంభంలో బ్రూక్ వదిలేసిన క్యాచ్ టీం ఇండియా భారీ స్కోర్‌కు పునాది వేసిందని, అలాగే చివరి దశలో బౌలింగ్‌లో టీం ఇండియా అద్భుతంగా పుంజుకుందని మెక్‌కలమ్ విశ్లేషించారు. వరుస విరామాలతో వికెట్లను కోల్పోవడమే కాకుండా, జాకబ్ బేతల్ రనౌట్ అవ్వడంతో మ్యాచ్ ఒక్కసారిగా మలుపు తిరిగిందని, అక్కడే తమ ఓటమి ఖరారు అయిపోయిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో పరుగులు రాబట్టడం చాలా కష్టంగా మారిందని, అతని స్పెల్ తమ ఓటమిని శాసించిందని బ్రెండన్ మెక్‌కలమ్ పేర్కొన్నారు. తమ జట్టు కుర్రాడు జాకబ్ బేతల్ ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌ను మెక్‌కలమ్ కొనియాడారు. అతడు ఎంతటి గొప్ప ఆటగాడో మరోసారి ప్రపంచానికి తెలిసిందని మెక్‌కలమ్ అన్నారు. 250 పరుగుల భారీ లక్ష్యం ఉన్నప్పటికీ, తమ జట్టు చివరి వరకు పోరాడిందని మెక్‌కలమ్ పేర్కొన్నారు. ఓడిపోయినప్పటికీ, తమ జట్టు చూపించిన ధైర్యం చూసి తాను గర్వపడుతున్నానని తెలిపారు.




## పెద్ది.. అచ్చియమ్మ సర్ ప్రైజ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం 'పెద్ది'. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఇవాళ తన 29వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం ఆమెకు వినూత్నంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఒక స్పెషల్ వీడియోను విడుదల చేసింది. ఈ చిత్రంలో జాన్వీ 'అచ్చియమ్మ' అనే పల్లెటూరి యువతి పాత్ర పోషిస్తోంది. ఇందులో దర్శకుడు బుచ్చిబాబు తనదైన శైలిలో జాన్వీ అందాన్ని వర్ణించిన తీరు ఆకట్టుకుంటోంది. "కాటుక అక్కర్లేని ఆ కళ్లు, ముక్కుపుడక అక్కర్లేని ఆ ముక్కు.. అంటే అలంకరణ అక్కర్లేని అరుదైన చికిరియే ఈ చికిరి" అంటూ ఆయన చెప్పిన మాటలతో ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రామ్ చరణ్ సరసన జాన్వీ నటిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే చివరి దశకు చేరుకున్న ఈ సినిమా షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు

### రామ్ చరణ్ స్పెషల్ బర్త్ డే విషెస్

షూటింగ్ సమయంలో చరణ్, జాన్వీ ఇతర టీమ్ మెంబర్స్‌తో సరదాగా గడుపుతున్న లైట్ హార్టెడ్ మూమెంట్స్ ఈ వీడియోలో హైలైట్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా చరణ్ స్పందిస్తూ.. "మా అచ్చియమ్మ, ఎంతో హుందాగా ఉండే జాన్వీ కపూర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. తన వృత్తి పట్ల ఆమెకున్న ప్యాషన్, నిబద్ధత చూడటం చాలా సంతోషంగా ఉంది. ఈ ఏడాది తనకి అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని రాసుకొచ్చారు.

## 'అసభ్యకర జూమ్' కల్చర్..

### హీరోయిన్ సప్తమి పోరాటానికి శివ రాజ్‌కుమార్ మద్దతు!



నటీమణుల పట్ల కొందరు కెమెరామెన్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రదర్శిస్తున్న వైఖరిపై కన్నడ చిత్ర పరిశ్రమలో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. సినిమా వేడుకల్లో నటీమణుల ప్రతిభను, వారి శ్రమను గుర్తించాల్సింది పోయి, కేవలం వారి శరీర భాగాలను అసభ్యకరంగా జూమ్ చేస్తూ వీడియోలు తీయడంపై 'కాంతార' ఫేమ్ సప్తమి గౌడ ఘాటుగా స్పందించింది. ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ ముసుగులో జరుగుతున్న ఈ "బాడీ ఆబ్జెక్టిఫికేషన్" సంస్కృతి సమాజ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కేవలం వ్యూస్ కోసం నటీమణుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ధోరణి తక్షణమే ఆగిపోవాలని ఆమె డిమాండ్ చేసింది. ఈ అంశంలో సప్తమి గౌడకు ప్రముఖ సినీ నటుడు శివ రాజ్‌కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా ఒక ఘాటైన లేఖను విడుదల చేసిన ఆయన, మహిళలను గౌరవించడం అనేది ఒక ప్రాథమిక సంస్కారమని గుర్తుచేశారు. నటీమణులను కేవలం వస్తువులుగా చూడటం ఆపేయాలని హితవు పలుకుతూ, #ActorsNotObjects అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఈ 'జూమ్ కల్చర్'కు వ్యతిరేకంగా తన నిరసనను తెలియజేశారు. ఆయన కుమార్తె, నిర్మాత నివేదిత రాజ్‌కుమార్ కూడా ఈ గళానికి తోడై, మహిళలను కేవలం ఒక శరీరంగా చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, నోరా ఫతేహి వంటి అగ్ర తారలు ఇటువంటి అసభ్యకర ఫొటోగ్రఫీపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడు కన్నడ పరిశ్రమ నుంచి రుక్మిణి వసంత్, ఆషిక రంగనాథ్, దివ్య స్పందన వంటి నటీమణులు కూడా సప్తమికి బాసటగా నిలుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. సెలబ్రిటీల వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ప్రస్తుతం పరిశ్రమలో బలంగా వినిపిస్తోంది.

## పుకార్లకు మరింత బలం...

### ఒకే కారులో వచ్చిన విజయ్, త్రిష



తమిళ సినీ పరిశ్రమలో దశాబ్దాలుగా వెలుగొందుతున్న నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్, ప్రముఖ నటి త్రిషల మధ్య ఉన్న ఏదో ఉందంటూ వస్తున్న పుకార్లు ఇప్పుడు మరోసారి కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. తన భర్తకు ఒక నటితో సంబంధం ఉందంటూ విజయ్ భార్య సంగీత ఇటీవల సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో, చెన్నైలో జరిగిన ఒక వివాహ రిసెప్షన్‌కు విజయ్-త్రిష జంట ఒకే కారులో కలిసి రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ప్రముఖ నిర్మాత కల్పతి ఎస్. సురేశ్ కుమారుడి వివాహ వేడుకకు తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన దిగ్గజాలంతా హాజరయ్యారు. అయితే, అందరి కళ్లు మాత్రం విజయ్, త్రిషలపైనే నిలిచాయి. వారిద్దరూ కలిసి ఒకే కారులో రావడం, వేడుకలో పక్కపక్కనే కూర్చుని సందడి చేయడం చూసిన వారంతా వారి మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమేనా? లేక అంతకు మించి ఏమైనా ఉందా? అనే చర్చలు మొదలుపెట్టారు. గతంలో వీరిద్దరూ 'ఘిల్లి', 'తిరుపాచి', 'కురువి', 'లియో' వంటి చిత్రాల్లో కలిసి నటించారు. అప్పటి నుంచే వీరిద్దరి మధ్య ఏదో ఉందనే ఊహాగానాలు ఉన్నప్పటికీ, ఎప్పుడూ ఇలా బహిరంగంగా ఒకే కారులో కనిపించిన దాఖలాలు లేవు. విజయ్ వ్యక్తిగత జీవితం చుట్టూ వివాదాలు నడుస్తున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. గత డిసెంబర్‌లోనే విజయ్ భార్య సంగీత విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసినట్లు వెల్లడిస్తూ, తన భర్తకు ఒక నటితో అనుబంధం ఉందని చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద తుపానును సృష్టించాయి. ప్రస్తుతం ఈ విడాకుల కేసు చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానంలో కొనసాగుతోంది. అటు రాజకీయంగా చూస్తే, రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం విజయ్ తన శక్తియుక్తులను



## పెళ్లి పీటలు ఎక్కబోతున్న హీరో బెల్లంకొండ శ్రీనివాస్

వధువు వివరాలను గోప్యంగా ఉంచిన వైనం యాక్షన్ చిత్రాలతో వెండితెరపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ నెల మార్చి 8న ఆయన నిశ్చితార్థ వేడుక జరగనుంది. గత కొన్నేళ్లుగా ఒక యువతితో ప్రేమలో ఉన్న శ్రీనివాస్, ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో తన స్నేహితురాలిని పెళ్లాడబోతున్నాడు. ఈ వేడుకను అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో చాలా ప్రైవేట్‌గా నిర్వహించనున్నట్టు సమాచారం. వధువు వివరాలను ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే ఈ జంట పెళ్లి పీటలు ఎక్కాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ వార్త బయటకు రావడంతో బెల్లంకొండ అభిమానులు సోషల్ మీడియా వేదికగా శు భాకాంక్షలు తెలుపుతున్నారు.



## శ్రీరామ నవమి కానుకగా...

'కోర్ట్' చిత్రంతో మెప్పించిన హర్ష్ రోషన్, శ్రీదేవీ జంట మళ్లీ 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 26న రిలీజ్ చేయబోతోన్నారు. 'బ్యాండ్ మేళం' టీజర్, ట్రైలర్, మాస్ పెప్పీ సాంగ్ 'తిప్పా కుం టున్నావ్', మంచి మెలోడీ సాంగ్ 'పల్లెలోని సందల్లన్ని మీవే' వంటివి ఆడియెన్స్‌లో సినిమా పట్ల అంచనాల్ని పెంచేసింది. యూత్ ఆడియెన్స్‌లో ఇప్పటికే మంచి అంచనాలను సృష్టించిన ఈ చిత్రం శ్రీరాముడి ఆశీస్సులతో శ్రీరామ నవమి సందర్భంగా రిలీజ్ కాబోతోంది. మార్చి 26న ఈ సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్లు ప్లాన్ చేశారు.

## 'కన్నప్ప' బ్యూటీ సైలెంట్ గా షాక్

'కన్నప్ప' చిత్రంతో ప్రీతీ ముకుందన్ ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన బ్యూటీ. అప్పటికే టాలీవుడ్ లో 'ఓం బీం భుష్ 'అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చినా? ఆ సినిమా రీచ్ అవ్వకపోడంతో ప్రీతీ పేరు ఎక్కడా బయటకు రాలేదు. అలాగని 'కన్నప్ప' హిట్ చిత్రం కాదు. మంచు ఫ్యామిలీ సినిమా కావడం సహా పాన్ ఇండియాలో పెద్ద ఎత్తున ప్రచారం దక్కడంతో? ప్రీతీ ముకుందన్ పేరు టాలీవుడ్ లో సంచలనంగా మారింది. నెమలి పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అందం, అభినయంతో మంత్ర ముగ్ధుల్నిచేసింది. ఆ తర్వాత మళ్లీ మరో తెలుగు సినిమాలో ఛాన్స్ అందుకోలేదు. కానీ ఈ బ్యూటీ చాప కింద నీరులా బాలీవుడ్ లో కూడా విస్తరిస్తుంది. ఏకంగా ఓ సినిమా షూటింగ్ ని సైతం క్లైమాక్స్ కు తీసుకొచ్చి సర్ ప్రైజ్ చేసింది. ఇంతకీ ఏంటా సినిమా అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. కార్తీక్ ఆర్యన్ కథానాయకుడిగా మృగ్ దీప్ సింగ్ లాంబా 'నాగ్జిల్లా' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్లగా చాలా మంది భామల్ని పరిశీలించారు. కానీ ఎవర్ని ఎంపిక చేసారు ? అన్నది మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. దీంతో హీరోయిన్ స్థానం ఇంకా ఖాళీగానే ఉందని అంతా అనుకుంటున్నారు. కానీ ఆ స్థానంలో ప్రీతీముకుందన్ ఎంపిక చేసి సైలెంట్ గా షూటింగ్ కూడా పూర్తి చేస్తున్నారని ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందిఇప్పటికే ఆమె పాత్రకు సంబంధించి కీలకమైన సన్నివేశాలు పూర్తి చేసారు. మరో ఏడు రోజుల పాటు షూటింగ్ కు హాజరైతే ఆమె పార్టు పూర్తవుతుంది.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613